ప్రజాశక్తి

బుధవారం 25 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మరింత కేంద్రీకరణ దిశగా..

- నియోజకవర్గాల్లో ఎక్కువ తిరిగితేనే పాలకవర్గ నేతలకు భవితవ్యం
- ఏడాది పాలన సర్వేలతో నేతల్లో పెరుగుతున్న గుబులు
- అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో తిరిగేందుకూ ఆటంకం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కూటమి పాలన ఏడాది ముగిసింది. మంత్రులు బాధ్యతలు స్వీకరించి కూడా అంతే సమయం గడిచింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా వివిధ నిఘా సంస్థలతో సర్వేలు చేయించింది. ఫోన్ల ద్వారా కూడా ప్రజాభిప్రాయం సేకరించారు. పనితీరు ఎలా ఉందనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు ఈ పాటికే సమాచారం ఇచ్చారు. 'తస్మాత్ జాగత్త' అంటూ హెచ్చరికలు చేశారు. మరో వైపు యువ నేత నారా లోకేష్ కూడా ఎమ్మెల్యేల పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని ఢిల్లీ మీడియాతో అన్నారు. మనం ఎలా ఉన్నాం? జనంలో ఎలాంటి స్పందన ఉంది? పని తీరు ఎలా ఉందనే దానిపై కూటమి సర్కారు ఓ అంచనాకు వచ్చింది. దాదాపుగా అందరూ ఒకేస్థాయిలో ఉన్నారు. ఒకరిద్దరు పనితీరులో మరింత వెనుకపట్టు పట్టారని సమాచారం. ఏదేమైనా అందరి పనితీరూ మెరుగుపడాలన్నది ▶ 2లో

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

- సముద్రాన్ని ఆక్రమించి ఉపాధిని దెబ్బతీశారని మత్స్యకారుల ఆందోళన..
- బారికేడ్లు తోసుకొచ్చిన నేపథ్యంలో పోలీసులతో వాగ్వివాదం..
- చేపల వేటకు ఆటంకం లేకుండా చేస్తా:కలెక్టర్

బాపట్లలో మత్స్యకారుల ర్యాలీ

ప్రజాశక్తి-బాపట్ల

తమ ఉపాధిని దెబ్బతీశారని మత్స్యకారులు చేపట్టిన ఆందోళన బాపట్ల కలెక్టరేట్ వద్ద మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. సముద్రాన్ని ఆక్రమించేసి.. తమ ఉపాధిని దెబ్బతీసే విధంగా ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్ సముద్రంలో కలిసే ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారులు మొగ (సముద్రంలో కలిసే ప్రాంతాన్ని) ఆక్రమించేశారు. చేపల వేటకు వెళ్లాల్సిన పడవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ ప్రాంతాన్ని ఆక్రమించిన వ్యాపారి బుర్ల వెంకట్రావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మత్స్యకారులు మంగళవారం నాడు పెద్దఎత్తున కలెక్టరేట్ వద్దకు కదిలారు. బాపట్లలో ర్యాలీ నిర్వహించారు. బాపట్ల పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ నుండి సాగిన మత్స్యకారుల ర్యాలీ కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు సాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు కలెక్టర్ కార్యాలయం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో మత్స్యకారులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు, మత్స్యకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పెద్దఎత్తున ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు పలువురు మత్స్యకారులతో కలిసి ▶ 2లో

కలెక్టర్‌తో మాట్లాడుతున్న మత్స్యకారులు, నాయకులు

వినోద్‌కుమార్ ఇంట్లో పోలీసుల సోదాలు

పలు కీలక పత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు విచారణ వేగవంతంగా సాగుతోంది. కేసు విచారణలో భాగంగా హత్య కేసులో ప్రధాన నిందితుడు బోర్లగుంట వినోద్‌కుమార్ ఇంట్లో మంగళవారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో ▶ 2లో

సోదాలు చేసేందుకు వచ్చిన పోలీసులు

రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించిన
ఇద్దరు వైసిపి కార్యకర్తలు అరెస్టు
3లో

10 రోజుల్లోగా
బంగారు బాల్యం సర్వే పూర్తి
3లో

పొగాకు ధరలు తగ్గకుండా చూడాలి
రైతుసంఘం డిమాండ్
3లో

గొప్పలు మాని.. అభివృద్ధి చేయండి

- కూటమి ఎన్నికల హామీల అమలు ఎప్పుడో.?
- కాంగ్రెస్‌తోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి
- ప్రెస్‌మీట్‌లో పిసిసి అధ్యక్షురాలు షర్మిల వెల్లడి

మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షురాలు షర్మిల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సూపర్ సిక్స్ కాదు సూపర్ ఫ్లాప్, సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం మాని ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి చేసి చూపించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల కూటమి ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు ఒంగోలు వచ్చిన ఆమె పాటిబండ్ల గోపాలస్వామి కల్యాణ మండపంలో పాత్రికేయులతో మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో నడుస్తున్న కూటమి సర్కార్ ఏడాదిలోనే సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ కాదు, సూపర్ ఫ్లాప్ పాలన అంటూ విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల సంగతి ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రజలకు నమ్మకాన్ని వమ్ము చేశారని ప్రతి పథకంలో కోతలేనని, అర్హులకు మొండిచెయ్యి చూపిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో 80 లక్షల మంది రైతులు ఉంటే 40 లక్షల మంది మాత్రమే పథకం వర్తించే పరిస్థితి ఉందన్నారు. తల్లికి వందనం పథకం పరిస్థితి కూడా ఇంతేనని తెలియజేశారు. మహాశక్తి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్,



మరింత కేంద్రీకరణ దిశగా..

(మొదటిపేజీ తరువాయి)

సారాంశం. ఉమ్మడి ప్రకాశంలో మంత్రుల విషయానికి వస్తే వీళ్ల పనితీరు పర్వాలేదనే స్థాయిలో ఉంది. కొత్తగా బాధ్యతలు చేపట్టడం, శాఖలతో పాటు నియోజకవర్గాలకు సమయం కేటాయించడంలో కొంత సమన్వయ లోపం, ఇబ్బందులు ఎదురవుతున్నాయనే చర్చ ఉంది. మంత్రులు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నామనే విషయాన్ని కూడా గ్రహించి చిన్నచిన్న కార్యక్రమాలకు కూడా వీలైనంత మేరకు హాజరవుతున్నారు. జనంలోనూ మంత్రుల విషయంలో కొంత ఆలోచన కూడా ఉంది. మంత్రులుగా ఉన్నందున రాష్ట్రం అంతా తిరగాల్సి ఉన్నందున నియోజకవర్గాల్లో కొంత సమయం తగ్గిందని ద్వితీయశ్రేణి నేతలు గుర్తిస్తున్నారు. ఇక ఎమ్మెల్యేల విషయానికి వస్తే ఎక్కువ మంది పర్వాలేదనే స్థాయిలో ఉన్నారు. కొందరు రెడ్‌జోన్‌లోనూ ఉన్నట్లు సర్వేల్లో వెల్లడవుతోంది. ఎవరన్నది పార్టీ అధినేత చంద్రబాబు వారికి సమాచారం ఇచ్చారు. ఎవరిపై ఎంత అసంతృప్తి ఉందనే విషయం సూత్రప్రాయంగా ఇచ్చారు. దీన్ని అధిగమించాలంటే ఎక్కువ రోజులు నియోజకవర్గాల్లో గడపాలి. అందుకు అందరికీ సాధ్యమవుతుందా? అంటే కనిపించడం లేదు. ఎక్కువ శాతం మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లోనే నివాసం ఉండటం లేదు.

కొందరు మాత్రం ఉన్నారు. రెండు, మూడు రోజులు తిరిగినా మళ్లీ వ్యాపారాలు, ఇతర పనుల కోసం హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల్లో గడుపుతున్నారు. దీని వల్ల నియోజకవర్గాల్లో గడిపే సమయం తగ్గిపోతోందని చెబుతున్నారు. ఏడాదిలో ఎమ్మెల్యేలపై అసంతృప్తి పెరుగుతోందంటే కేవలం వీళ్ల పనితీరు ఒక్కటే కారణమా? అని పరిశీలిస్తే ప్రభుత్వం పనితీరు కూడా దోహదపడుతోంది. ఎందుకంటే ఏడాదిలో కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అగ్రభాగం పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆర్థిక పరిస్థితులు బాగాలేవని వాయిదా వేశారు. ఏడాదిలో కేవలం మూడు గ్యాస్ సిలిండర్లు పథకం ఒక్కటే అమలు జరగ్గా దాని ప్రభావం పెద్దగా చూపలేదు. మొన్న తల్లికి వందనం పథకం అమలులోకి వచ్చింది. నెలనెలా పెన్షన్లు మాత్రమే పెరుగుదలలో కనిపించాయి. అన్నా క్యాంటీన్లు మరొక అంశం. ఇవి మాత్రమే కూటమి వచ్చాక మార్పుగా కనిపించినవి. ఇంకేమీ లేవు. అమరావతిపై దృష్టి సారించారు. దాని ప్రభావం ఎమ్మెల్యేలపై లేదు. గ్రాఫ్ పెరగడానికి ఉపయోగపడలేదు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఏమైనా ఊపందుకుందా? అంటే అదీ లేదు. దీంతో వ్యాపారవర్గాల్లోనూ కూటమిపై అసంతృప్తి కనిపిస్తోంది. సూపర్‌సిక్స్‌తో పాటు జిల్లాల్లో ఇచ్చిన హామీలు కూడా బుట్ట దాఖలయ్యాయి. మార్కాపురం జిల్లా ఏర్పాటు, ప్రకాశంలో అద్దంకి, కందుకూరు విలీనం, వెలిగొండ ప్రాజెక్టు, ప్యాకేజీలు, పునరావాసం పెండింగ్, జిల్లా డెయిరీ పునరుద్ధరణపై చర్యలు లేకపోవడం, విశ్వవిద్యాలయం విస్తరణ, ట్రిపుల్‌ఐటీ నిర్మాణం వంటివి ప్రశ్నార్థకంగా మారాయి. తాగునీటి పథకాలు సాగునీటి ప్రాజెక్టులతో ముడిపడి ఉన్నందున కనీసం ప్రజల దాహార్తిని కూడా తీర్చలేకపోయారు. ఇవన్నీ ప్రభుత్వం వైపు నుంచి జరిగిన తప్పిదాలు మంత్రులు, ఎమ్మెల్యేలపైనా ప్రభావం చూపాయి. పనితీరు విషయానికి వచ్చేసరికి కేవలం ఎమ్మెల్యేలను బోనులో నిలబెట్టారనే చర్చసాగుతోంది. వాస్తవానికి ఎమ్మెల్యేలపై అసంతృప్తి పెరగడానికి ప్రభుత్వ పనితీరుతో పాటు స్థానికంగా రేషన్,మద్యం, గ్రావెల్,గ్రానైట్ దందాలు కూడా కారణాలుగా ఉన్నాయి. ఇవన్నీ ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఎవరూ చేయడం లేదు. వసూళ్ల పర్వం అధికారుల నుంచీ అధికారపార్టీ నేతల వరకూ ఎవరిస్థాయిలో వాళ్ల లాగుతున్నారన్నది బహిరంగ సత్యం. ఈ దందాలు గత ప్రభుత్వంలోనూ నడిచాయి. అందుకే వారిని ఇంటికి పంపారు. ఇప్పుడు వీళ్లు కూడా వదల్లేదు. సంపాదనకు వాటినే మార్గాలుగా ఎంచుకున్నారు. ఎన్నికల్లో పెట్టిన కోట్లాది రూపాయల తాలూకు అప్పులు కొందరిని వెంటాడుతున్నాయి. అందుకే వచ్చిన కాడికి రాబడుతున్నారు.

ఇక వీటిని డైవర్ట్ చేయాలన్నా.. జనంలో మళ్లీ ఆదరణ పెరగాలన్నా గ్రామాల్లో తిరగడం ఒక్కటే మార్గంగా భావిస్తున్నారు. నియోజవర్గాల్లో మరింత కేంద్రీకరించాలని పార్టీ అధినేత సిఎం చంద్రబాబు కూడా నిర్దేశించారు. ఎక్కువ సమయం కేటాయించడం, జనం, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నదే ఎమ్మెల్యేల మందున్న కర్తవ్యంగా కనిపిస్తోంది.

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు. చర్చల్లో ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు, సైకం రాజశేఖర్, ఎరిపిల్లి రమణ ,చొక్కా రాంబాబు, సీలం రవి, బక్కా పరంజ్యోతి, వత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి. కొండయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాబురావు, టి.కష్ణమోహన్, కే శరత్, జి.ఏసుబాబు, మత్స్యకార సంఘం నాయకులు దోని కనకారావు, పిక్కి నారాయణరావు, కోడా రవి,చిక్కి దేవుడు,పి. సూర్యారావు పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

చేపల వేటకు ఆటంకం లేకుండా చేస్తా..

చేపల వేటకు ఆటంకంగా ఉన్న ఈపురుపాలెం కాల్వలో అడ్డురాళ్లను తక్షణమే తొలగిస్తామని, మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కాల్వను పూడ్చడానికి వేసిన రాళ్ళను తొలగించాలంటూ చేపల వేట నిలిపివేసి ఆందోళన నిర్వహిస్తున్న 9 గ్రామాలలోని మత్స్యకార ప్రతినిధులను కలెక్టర్ పిలిపించి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆ గ్రామాలలోని మత్స్యకారుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం ఆయన సుదీర్ఘంగా చర్చించారు. తదుపరి మత్స్యకారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. కాల్వ సమీపంలో ఉన్న పట్టాదారుడు ఆ కాల్వను పూడ్చడం, వరద నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. తొమ్మిది గ్రామాలలోని మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన కాల్వను పూడ్చడంపై విచారిస్తామన్నారు. కాల్వలో వరద ప్రవాహాన్ని అడ్డుకునేలా పూడ్చడంపై కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆ కమిటీలో ఆర్డీవో, భూగర్భ గనులు, జల వనరులు, కాలుష్య నియంత్రణ మండలి, డీఎస్పీ, మత్స్య శాఖ అధికారులు, మత్స్యకార నాయకులు ఉంటారన్నారు. నెల రోజుల్లో సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ఆక్రమించినట్లు తేలితే సీఆర్ జెడ్ చట్టం ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకతి సిద్ధంగా ఏర్పడిన కాల్వ యథాతదంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకారులపై నమోదైన కేసులు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడానికి ఆటంకంగా ఉన్న అన్ని పరిస్థితులను సరి చేస్తామని తెలిపారు. ఈపురుపాలెం కాల్వను పూడ్చడంపై విచారించి బాధ్యులపై చర్య తీసుకోవాలని మత్స్యకార ప్రతినిధులు రాజశేఖర్, నాగార్జున, ఆర్ఎం శీలం కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, అనుబంధ శాఖల అధికారులు, మత్స్యకార ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గొప్పలు మాని.. అభివృద్ధి చేయండి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్న గౌతం

జాబ్ క్యాలెండర్ పథకాలు అమలు పరిస్థితి ఏమిటో చెప్పాలని కూటమి సర్కార్‌ను ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ రూ 4,300 బకాయిలు, ఆరోగ్య శ్రీ పథకం బకాయిలు రూ.4 వేల కోట్లు ఉన్నాయని, వాటి సంగతేంటని సూటిగా ప్రశ్నించారు. ఏడాదిలోనే పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఏ పార్టీలు అధికారంలోనే ఉన్నా ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, ఏపిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా జిల్లా పర్యటన చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో కాంగ్రెస్‌కి మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు షేక్ సైదా, జిల్లా ఇన్‌చార్జ్ గౌతు సత్యేంద్ర, గుంటూరు, తిరుపతి ఇన్‌చార్జ్‌లు శ్రీపతి ప్రకాశం, ఈదా సుధాకర్ రెడ్డి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బిఆర్ గౌస్, కొండపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతి సతీష్, సంతనూతల పాడు నియోజకవర్గ కోఆర్డి నేటర్ పాలపర్తి విజేష్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్, మన్నం ప్రసన్నరాజు, ఎస్‌సి విభాగ అధ్యక్షులు ఉద్దండి మల్లికార్జునరావు, ఒంగోలు నగర అధ్యక్షురాలు టి నాగ లక్ష్మి, ఎస్‌కె రసూల్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.No.154/2024
A.S.No.63/2018

గాదంశెట్టి వీరాంజనేయులు (Died)
వగైరాలు – పిటిషనర్లు / అప్పీలెంట్స్
Vs
పోకూరి రామయ్య (Died)
వగైరాలు – రెస్పాండెంట్లు

నోటీసు

టు,
R5. **పోకూరి సౌమ్య,**
తండ్రి లేట్ **సత్యనారాయణ,** వయస్సు 29 సం॥లు,
R6. **పోకూరి సతీష్ కుమార్,** తండ్రి లేట్ **సత్యనారాయణ,** వయస్సు 27 సం॥లు, ఇరువురు హిందూ, గవర్నమెంటు కాలేజీ ప్రక్కన, కనిగిరి రోడ్డు, పామూరు గ్రామం మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు అప్పీలు నందు మిమ్ములను రెస్పాండెంట్లు 5 మరియు 6 లుగా చేర్చమని కోరుతూ దాఖలు చేసిన పై నెంబరు పిటిషన్ నందు మీ యొక్క నోటీసు నిమిత్తం శ్రీయుత కోర్టు వారు సదరు కేసును **తే25-06-2025ది** నకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా **తే25-06-2025ది ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా: **25-06-2025**
కందుకూరు
24-06-2025

శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
యం.మల్లికార్జున రావు, బి.కాం., బి.యల్.,
పిటిషనర్లు / అప్పీలెంట్స్ తరపు న్యాయవాది

వినోద్‌కుమార్ ఇంట్లో పోలీసుల సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

పలు కీలక పత్రాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో నలుగురు నిందితులను పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. నిందితులకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసు విచారణ అధికారి ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ విజయకృష్ణ, సిబ్బందితో కలసి స్థానిక కొప్పోలు రోడ్, డ్రీమ్ స్కూల్ వద్ద ఉన్న బోర్లగుంట వినోద్‌కుమార్ ఇంటిలో సోదాలు జరిపారు. బోర్లగుంట వినోద్‌కుమార్ ఇంట్లో ముద్దాయిలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, ముద్దాయిల మధ్య జరిగిన కమ్యూనికేషన్, కీలకమైన పత్రాలు, ఖాతాల పత్రాలు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు, రికార్డింగ్స్ వంటి పలు అంశాలను అధికారులు పరిశీలించారు. కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు, నిందితుల సంబంధాలు వెలుగులోకి తీసుకురావడంపై పోలీసులు దృష్టి సారించారు.

In the Court of the Senior Civil Judge : Kandukur

I.A.No. 831 / 2023
A.S.No.   / 2023

Indla Bala Obaiah - Petitioner / Appellant
Vs
Indla Sreenu, and Others - Respondents

To,
R3. **Indla Obaiah,** S/o **Mugaiah,**
Cultivator, Tummagunta Village, Kanigiri Mandal, Prakasam District, A.P.
R4. **Indla China Balaiah,** S/o **Veeraiah,**
Cultivator, Tummagunta Village, Kanigiri Mandal, Prakasam District, A.P.

పై నెంబరున పిటీషనర్ మీ మీద పిటిషన్ (UNDER ORDER 41, RULE 3(A) OF C.P.C) పరిహారముల నిమిత్తం పిటీషన్ దాఖలు చేసినందుకు మీకు నోటీసు నిమిత్తం **తేది: 07-07-2025** కి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **07-07-2025**
కందుకూరు.

వై.సాంబశివరావు
పిటిషనర్ తరపు అడ్వకేట్, కందుకూరు.

ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి (మహిళా కోర్టు) ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

ఐ.ఎ.నెం. 45/2025 ఇన్
ఒ.ఎస్.నెం. 22/2025

Between:
శ్రీ మద్దాల వీర వెంకట శ్రీనివాస్ **...పిటీషనర్/వాది**
మరియు
శ్రీ మద్దాల చిన్న వెంకటేశ్వరులు
మరియు ఇతరులు **...రెస్పాండెంట్స్/ప్రతివాదులు**

పిటీషనర్/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన జిల్లా గంగాదేవి W/o. జిల్లా నెహూబాబు, తాతా బిల్డింగ్స్, కర్నూలు రోడ్డు, ఒంగోలు సిటీ & జిల్లా వారికి పై నెంబర్ గల పిటిషన్‌లో **ది. 02-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని సదరు కోర్టు నందు హాజరై తమ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల సదరు పిటిషన్ ఏకపక్షంగా తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కట్టా సత్యనారాయణ
ఏలూరు న్యాయవాది
ది. 23-06-2025 పవర్‌పేట, ఏలూరు

CHANGE OF NAME

I, **RAMAJANEYULU VADDINENI** (Old Name) S/o **VENKATESWARLU,** Resident of D.No. 2-19, Sivarampuram Village, Tallur Mandal, Prakasam District - 523264, Andhra Pradesh. I, have Changed my name as **VADDINENI RAMANJANEYULU** (New Name) S/o **VENKATESWARLU,** Hereafter my name is known as **VADDINENI RAMANJANEYULU** (New Name) S/o **VENKATESWARLU.**

ప్రకటన

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి (మహిళా కోర్టు) ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా

ఐ.ఎ.నెం. 46/2025 ఇన్
ఒ.ఎస్.నెం. 22/2025

Between:
శ్రీ మద్దాల వీర వెంకట శ్రీనివాస్ **...పిటీషనర్/వాది**
మరియు
శ్రీ మద్దాల చిన్న వెంకటేశ్వరులు
మరియు ఇతరులు **...రెస్పాండెంట్స్/ప్రతివాదులు**

పిటీషనర్/వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన జిల్లా గంగాదేవి W/o. జిల్లా నెహూబాబు, తాతా బిల్డింగ్స్, కర్నూలు రోడ్డు, ఒంగోలు సిటీ & జిల్లా వారికి పై నెంబర్ గల పిటిషన్‌లో **ది. 02-07-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని సదరు కోర్టు నందు హాజరై తమ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల సదరు పిటిషన్ ఏకపక్షంగా తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కట్టా సత్యనారాయణ
ఏలూరు న్యాయవాది
ది. 23-06-2025 పవర్‌పేట, ఏలూరు

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు సీనియర్ రీజినల్ మేనేజర్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ నెల్లూరు వారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ప్రకాశం జిల్లా, మార్కాపురం మునిసిపాలిటి , డోర్ నెంబర్:9-32, హరిజనవాడ మార్కాపురం టౌన్ కి చెందిన ముకిరపు తుమ్మలయ్య గారి కుమారుడు ముకిరపు ఆంజనేయులు గారి నుండి పెట్రోల్ బంకు వ్యాపార నిమిత్తం క్రింది షెడ్యూల్ దాఖలా భూమి నా కక్షిదారుడు లీజుకు తీసుకొనుటకు అంగీకరించినారు సదరు విషయమై ఎవరికైన ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 10 రోజుల లోగా మా కక్షిదారునకు గాని లేదా నాకు గాని వ్రాత పూర్వకముగా అభ్యంతరములు తెలియ జేయగలరు .లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించగలము.

షెడ్యూల్

ప్రకాశం జిల్లా, పెద్దారవీడు మండలం & గ్రామము, పెద్దారవీడు గ్రామ సర్వే నెంబర్ :580-2B1 లో య.0-42 సెంట్ల పైకి య.0-20 సెంట్లు గల భూమి కి గలహద్దులు.

తూర్పు:చిట్యాల వెంకమ్మ,మెట్టు వెంకయ్య గార్ల భూమి
దక్షిణం : ఆమనగంటి పెద్దవెంకటేశ్వర్లు గారి మిగులు భూమి
ఉత్తరం : రోడ్
పడమర : అల్లు చిన్న వీరారెడ్డి, అల్లు వెంకటరెడ్డి గార్ల భూమి

ఇట్లు
పి.యస్.వి సత్యనారాయణరెడ్డి,
అడ్వొకేట్
జిల్లా కోర్ట్ ఎదురు ఫస్ట్ ఫ్లోర్, గోల్డెన్ టవర్స్, ఒంగోలు, ప్రకాశం జిల్లా, సెల్ 9390411081, 7993932981

ప్లాంటు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

బయోగ్యాస్ ప్లాంటు పనులు పరిశీలన

ప్రజాశక్తి-పీసీపల్లి

దివాకరపురం వద్ద రిలయన్స్ ఏర్పాటు చేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిలయన్స్ ఉద్యోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని కూడా అధికారులకు సూచించారు. అనంతరం ప్లాంట్ నుంచి మురుగుమ్మి వెళ్లే తారు రోడ్డు పనులను పరిశీలించారు. వీరి వెంట రిలయన్స్ అధికారులు మురిగుమ్మి పంచాయతీ టిడిపి నాయకులు కసిరెడ్డి హనుమారెడ్డి, పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి అచ్చెంనాయుడుతో శ్యామల కాశిరెడ్డి

అచ్చెన్నాయుడును కలిసిన శ్యామల కాశిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చంనాయుడుని మంగళవారం అమరావతిలోని వ్యవసాయ శాఖ చాంబర్లో 13 జిల్లాల డీసీఎంఎస్ అధ్యక్షులతో పాటు ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి మర్యాదాపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వ్యవసాయ శాఖ మంత్రితో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ ద్వారా విత్తనాలు, పురుగుమందులు, డీసీఎంఎస్ ద్వారా సరఫరా చేసే విధంగా సహకరించాలని కోరారు. అందుకు సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన 13 మంది డిసిఎంఎస్ అధ్యక్షులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న వెంకటనాయుడు

ఐవిఆర్ఎస్ కాల్స్‌పై పురోగతి సాధించాలి

జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు

ప్రజాశక్తి-సిఎస్ పురం

చంద్రశేఖరపురం మండలంలోని దర్శిగుంటపేటలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ కాల్స్‌పై దర్శిగుంటపేట పంచాయతీ పురోగతి 19 శాతం కన్నా తక్కువగా నమోదు కావడంతో పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణ పట్ల అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో అన్ని ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించేందుకు భాగంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్‌పై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరపురం ఎంపిడిఒ ఎల్.బ్రహ్మయ్య, ఇఓపిఆర్డి ఎం.రమణయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించిన

ఇద్దరు వైసీపీ కార్యకర్తలు అరెస్టు

ప్రజాశక్తి-పొదిలి

మాజీ ముఖ్యమంత్రి జగన్ పొదిలి పర్యటనలో రెచ్చగొట్టేలా ప్లకార్డులు ప్రదర్శించిన ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ వేమన తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ పొదిలి పర్యటన సందర్భంగా జరిగిన ఘర్షణలో "ఎవరైనా సరే తొక్కి పడేస్తాం" అంటూ ఫ్లెక్సీలతో నినాదాలు చేపట్టిన వెలిగండ్ల మండలం బొంతలగుంట్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సంగటి ఇసాక్, వెసిపోగు రాజేష్‌లను అదుపులోకి తీసుకొని ప్రత్యేకంగా విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయంలో పోలీస్ మరియు ప్రజలపై దాడికి పాల్పడిన ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారణ జరుగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్ఐ వేమన

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు (ఫైల్)

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-దర్శి

వివిధ దొంగతనాల కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6,12,000 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వై.రామారావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 29వ తేదీన మండలం లోని తూర్పు వీరాయపాలెం గ్రామంలో రాత్రిపూట ఆడవారి మెడలలో గొలుసులు లాక్కొని పారిపోయిన ఇద్దరు నిందితులు చిన్నక్కోల్ గోపి, చిన్న కర్నోల్‌వేసును అరెస్టు చేశారు. వీరు జరుగుమల్లిలో కూడా గత నెల 25వ తేదీన రాత్రిపూట నిద్రపోతున్న మహిళ మెడలో బంగారు గొలుసులు లాక్కొని వెళ్లారు. ఈ చోరీలపై కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ ఆర్.దామోదర్ ఆదేశాలతో డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిఐ వై.రామా రావు పర్యవేక్షణలో ఎస్ఐ ఎం.మురళి టీములుగా ఏర్పడి దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరు మంగళవారం దొంగతనం చేసిన బంగారు గొలుసులు అమ్ముకునేందుకు దర్శికి రాగా గంగవరం బస్టాండ్ వద్ద చాకచక్యంగా పట్టుకొని 68 గ్రాముల బంగారాన్ని స్వాధీనపరచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న సిఐ, ఎస్ఐని డీఎస్పీ, ఎస్పీ అభినందించారు.

మాట్లాడుతున్న సిఐ రామారావు

జీవో నెంబరు 5ను సవరించాలని వినతి

ప్రజాశక్తి-దొనకొండ

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవోనెంబర్-5 గ్రామ సచివాలయాల ఉద్యోగులకు ఇబ్బందికరంగా ఉంద ని ప్రభుత్వం జీవో నెంబర్ 5ను సవరించాలని ఉద్యోగులు మంగళవారం ఆందోళనలు చేపట్టారు. జీవో నెంబర్ 5ను సవరించి సచివాలయ ఉద్యోగుల బదిలీలు సొంత మండలం పరిధిలో విధులు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతే బదిలీలు చేయాలని, రేషనలైజేషన్ ప్రక్రియలో సర్ప్లస్ ఉద్యోగులను ఎలా ఉపయోగించబోతున్నారో స్పష్టత పూర్తయిన తర్వాతే బదిలీలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు ఎంపిడీవో వసంతరావుకు వినతిపత్రం అందజేశారు.

సీఎస్‌పురం: మండలంలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు రేషనలైజేషన్ కోసం విడుదల చేసిన జీవో నెంబర్ 5ను రద్దు చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యకు ఉద్యోగుల ఐక్యవేదిక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఇప్పటికే ఆరు సంవత్సరాలు పూర్తయిన గ్రామ సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఇచ్చిన తర్వాతనే బదిలీలు చేపట్టాలన్నారు. కొన్ని శాఖల ఉద్యోగులకు ఇప్పటికే సరియైన ప్రమోషన్ చానల్ లేకపోవడం ఈ నేపథ్యంలో తక్షణమే ఆయా శాఖల ఉద్యోగులకు ప్రమోషన్ మార్గాలు ఏర్పాటు చేయాలని, రేషనలైజేషన్ ప్రక్రియలో ఉద్యోగులను ఎలా వినియోగించబోతున్నారన్న అంశంపై స్పష్టత వచ్చిన తర్వాతే బదిలీలు చేపట్టాలన్నారు. డిగ్రీ అర్హతతో ఉద్యోగాలు పొందిన మాకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ వెంటనే అమలు చేయాలని, అంతర్ జిల్లాల బదిలీలు కేవలం ఇద్దరూ ఉద్యోగులు అయి ఉంటేనే బదిలీలకు అర్హులుగా ప్రభుత్వం సవరణ చేయాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్.ఖాదర్ బాషా, షేక్ పర్వీన్‌బేగం, టి.యశోదమ్మ, జి.రామశారద, షేక్ పరవీన్ బేగం, ఏ.శైలజ, జివి.నారాయణ, బి.శివన్నారాయణ తదితరులు ఉన్నారు.

ఎంపిడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

ఆటోలలో గాని ఇతర వాహనాల్లో గాని పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ అన్నారు. కనిగిరి ప్రాంతంలో మంగళవారం కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం నేతృత్వంలో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. రహదారుల పైన తరచు వాహన తనిఖీలు జరుగుతాయని ప్రయాణ సమయాలలో వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. హెల్మెట్ ధరించనివారికి, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న వారికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, ఎపిఎస్ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ మహేంద్ర

గేదెల దొంగలు అరెస్టు

ఐదు గేదెలు స్వాధీనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఇద్దరు గేదెల దొంగలను అరెస్టు చేసి వారి నుంచి ఐదు గేదెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బి.మహేంద్ర తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన ఐదు గేదెలు చోరీకి గురవ డంతో బాధితుడు అర్రిబోయిన బ్రహ్మయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన బక్క ముంతల ప్రసాదు, రావినూతల కొండలరావులను అదుపులోకి తీసుకొని విచారించగా గేదెలను తామే దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. ఈ ఐదు గేదెల విలువ సుమారు రూ.3.50 లక్షలు ఉంటుందని తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గేదెలను బ్రహ్మయ్యకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

మద్యం తాగి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. టంగుటూరుకు చెందిన ఉనిమేదల కామేశ్వరరావు అనే వ్యక్తి మద్యం తాగి అదే కాలనీకి చెందిన జరుబుల సుబ్బారావు, అతని కుమార్తె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కామేశ్వరావును మంగళవారం అరెస్టు శింగరాయకొండ కోర్టు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరచారు. మేజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం సుబ్బారావుకు ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడీవో

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపిడీవో మహబూబ్ బాషా

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలోని సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం మండలంలోని పి.రాళ్లపల్లి, గుడిపాటి పల్లి, వెలిగండ్ల తదితర సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల కోసం ప్రతిరోజు ఎన్ని అర్జీలు వస్తున్నాయని ఎన్ని అర్జీలు పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్ షర్మిల చీరాల రాక

ప్రజాశక్తి - చీరాల

పిసిసి చీఫ్‌వైఎస్ షర్మిళ

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ నేడు చీరాల రానున్నారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బైక్ ర్యాలీ ముంతవారి సెంటర్, బాలికోన్నత పాఠశాల మీదుగా ముక్కోణం పార్క్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్, రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి గడియారం స్తంభం సెంటర్లోని డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి అనంతరం పేరాల మార్కెట్ వైపు నుండి పద్మశాలి కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తల సభలో ఆమె మాట్లాడుతారని అన్నారు.

త్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 9 మందికి త్రిబుల్ ఐటీ సీట్లు లభించినట్లు హెచ్‌ఎం మాచర్ల మోహనరావు తెలిపారు. ఈ మేరకు సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నడు లేని విధంగా 9 మంది త్రిబుల్ ఐటీ సీట్లు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. వీరిలో నూజివీడు క్యాంపస్‌కు జి తపస్వి, ఎంవిఎస్ మౌనిక, పి కుసుమశ్రీ,, జి దీప్తి నాగ కౌసల్య, ఒంగోలు క్యాంపస్‌కు వి మేఘన, వి లక్ష్మి, ఎం జ్వలిత, ఆర్‌కెవెల్లి ఇడుపులపాయ క్యాంపస్‌కు వి శృతిహాసనీ, ఎల్ సుశైలి ఎంపికైనట్లు చెప్పారు.

త్రిబుల్ ఐటీ విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేమూరు : మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు త్రిబుల్ ఐటీ సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు భాషా తెలిపారు. త్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు, బదిలీలైన ఉపాధ్యాయులకు మంగళవారం సన్మానం చేశారు. ఐఐఐటి సాధించిన విద్యార్థులు టి సుహిత, జి మోహిత, ఎం భవ్యశ్రీ, బి సన్నీ, జి స్వాతి, ఈ లాస్య, ఎస్ మేఘనను ఎంపీపీ డి లలిత కుమారి, ఎంఈఓ నీలం దేవరాజ్ అభినందించారు. ఈ ఏడాది జిల్లా నుండి 47 మందికి త్రిబుల్ ఐటీ సీట్లు లభించగా వారిలో 16 మంది భట్టిప్రోలు మండలానికి చెందిన విద్యార్థులు కావడం గర్వకారణమని ఎంఈఓ దేవరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నన్నిపాముల చంటి, పూర్ణ చంద్రశేఖర్ ఉన్నారు.

డాక్టర్ రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

డాక్టర్ పి రామకృష్ణ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యునిగా డాక్టర్ పి రామకృష్ణ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా తాగునీటిని కాచి వడబోసి తాగటం వలన సీజనల్ వ్యాధుల అధిగమించవచ్చని చెప్పారు. తాను సత్య సాయి జిల్లాలో పనిచేస్తూ బదిలీపై కర్లపాలెం వచ్చినట్లు తెలిపారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న రైతు నాయకులు

నియోజకవర్గంలో బర్లీ పొగాకు కొనుగోళ్లు వేగవంతంగా చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు స్థానిక ఎఎంసి ఆవరణలోని వైట్‌బర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 200 చొప్పున పొగాకు బేళ్లు కొనుగోలు చేస్తున్నారని, ఈ విధంగా కొనుగోలు చేస్తే ఏడు నెలలు పడుతుందని పేర్కొన్నారు. ఈపాటికే వర్షాలు పడుతున్నాయని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా రోజు కనీసం వెయ్యి బేళ్ళ చొప్పున పొగాకు కొనుగోలు చేయాలని కోరారు. అదనంగా కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు నిర్ణయించిన ధరల్లో టాప్ ఆకు ధర రూ.12వేలు, లో గ్రేడ్ ఆకు ధర రూ.6వేల చొప్పున కొంటున్నారని, అయితే మధ్య గ్రేడు పొగాకు ధర నిర్ణయించి క్వింటా రూ.9వేల చొప్పున కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి శంకరయ్య మాట్లాడుతూ పొగాకు రైతులను ఇబ్బంది పెట్టకుండా పొగకు కొనుగోలు వేగవంతంగా చేయాలని, అవసరమైతే కొనుగోలు కేంద్రాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, ఎం డేవిడ్, ఎర్రం శ్రీనివాసరెడ్డి, వి పుల్లారెడ్డి, కె నాగూరు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సంతమాగులూరు

కె విజయరాణి

తోట జయలక్ష్మి

రాగనాగ అక్షిత

ఖాదర్‌మస్తాన్

షేక్ ఉమర్

వీరశివాజి

మండలంలోని మక్కెనవారిపాలెం, కుందుర్రు, చవిటిపాలెం ఉన్నత పాఠశాలల చెందిన ఆరుగురు విద్యార్థులు త్రిబుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. మక్కెనవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులు రాగ నాగాంక్షిత, ఉమర్, ఖాదర్ మస్తాన్, వీర శివాజీ త్రిబుల్ ఐటీకి ఎంపికవటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చవిటిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి కొర్రపాటి విజయరాణి, కుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి తోట జయలక్ష్మి నూజివీడు త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. మండలంలో ఆరుగురు విద్యార్థులు త్రిబుల్ ఐటీలకు ఎంపికవటం పట్ల విద్యా శాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు, దినేష్ కుమార్, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లి, దండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

11 మందికి ట్రిపుల్ ఐటి సీట్లు

ప్రజాశక్తి - పంగులూరు

భవనం దివ్య

జిఎంకె సాయిరాం

షేక్ షమీర

మండలంలోని వివిధ పాఠశాలల నుండి 11 మంది విద్యార్థులు త్రిబుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు ఎంఇఒ కె నాగభూషణం, జి వీరాంజనేయులు తెలిపారు. చందలూరు హై స్కూలుకు చెందిన కట్టా హారిక, జర్రా మణిదీపక్‌రెడ్డి, చల్లా గాయత్రి, సామా మణిదీపిక, పూర్ణ తేజచారి, బూదవాడ హైస్కూలుకు చెందిన భవనం దివ్య, జిఎంకె సాయిరాం, ఎస్‌కె సమీరా, కొండ మంజులూరు హైస్కూలుకు చెందిన పి భవ్యశ్రీ, బి వేదశ్రీ, ఎండ్లూరి సుమనశ్రీ త్రిబుల్ ఐటీ సీట్లు సాధించినట్లు తెలిపారు. కొండ మంజూలూరులో త్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. బూదవాడ హైస్కూలుకు చెందిన విద్యార్థులను హెచ్‌ఎం పూసల రఘురామయ్య, విద్యా కమిటీ చైర్మన్ అలవల వీరారెడ్డి, గ్రామ పెద్దలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, గాదే బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలు నాటాలని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - పర్చూరు

మొక్కలు నాటాలని తమిళనాడు ముత్తు చెల్వన్ సైకిల్ యాత్ర

పర్యావరణ పరిరక్షణ, ప్రాణవాయువు అందాలనే లక్ష్యంతో మొక్కలు నాటుతూ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు చెల్వన్ యాత్ర మంగళవారం పర్చూరుకు చేరింది. స్థానిక తహశీల్దారు కార్యాలయం సిబ్బంది స్వాగతం పలికారు. కార్యాలయం ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణవాయువు అంతదక ఎవరు మృతి చెందకూడదనే ఉద్దేశంతో తాను సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు చెప్పాడు. సైకిల్‌తో ఆసియా దేశాల పర్యటనకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ అందక చాలా మంది మృత్యు వాత పడటం తనను తీవ్రంగా కలిచి వేసిందని తెలిపారు. 2021 డిసెంబర్‌లో తాను సైకిల్ యాత్ర ప్రారంభించి దారి పొడవునా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మన దేశంతో పాటు నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ ప్రాంతాల్లో పర్యటించి మొక్కలు నాటినట్లు చెప్పాడు. రోజుకు 50 కిలోమీటర్ల చొప్పున ప్రయాణం చేసి 39,990 కిలోమీటర్లు ప్రయాణం చేసి 10లక్షల మొక్కలు నాటే విధంగా లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటికి 4.5 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. ముత్తు చిల్వన్ పలువురికి ఆదర్శంగా నిలిచాడని తహశీల్దారు బ్రహ్మయ్య, కార్యాలయం సిబ్బంది పేర్కొన్నారు.

మంత్రి అనితతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

మంత్రి అనితను కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనితను శాసన సభ్యులు మద్దలూరి మాల కొండయ్య సెక్రటేరియట్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్ళారు. నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి శాంతి భద్రత విషయంలో, అభివృద్ధిలో సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మంత్రి అచ్చెంనాయుడుని కలిసిన ఏలూరి

పొగాకు రైతుల ఖాతాల్లో రూ.273 కోట్లు జమ

ప్రజాశక్తి - పర్చూరు

పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన నల్లబర్లీ పొగాకుకు సంబంధించి రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.273 కోట్ల నగదు జమ చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో రైతుల ఇంట అనందం నిండిందని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందుమతిని సన్మానిస్తున్న ఎంఈఓ, సిబ్బంది

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు

ప్రజాశక్తి - కర్లపాలెం

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ఎంఇఒ ఎన్ విజయశ్రీ అన్నారు. స్థానిక ప్రాథమిక మోడల్ పాఠశాలకు నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి పాఠశాల సిబ్బంది స్వాగతం, వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, కె విమలమ్మ, డిఎల్ ప్రసన్నలక్ష్మి, ఎం ఇందుమతి పాల్గొన్నారు.

డాక్టర్ తహ అన్సారీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కర్లపాలెం

షేక్ తహఅన్సారీ

స్థాని పశువైద్యశాల అధికారిగా డాక్టర్ షేక్ తహఅన్సారీ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పశువుల యజమానులకు జూన్ 26 నుంచి జులై 10 వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు జీవాలకు నీలి నాలుక నివారణ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. సాధారణ బదిలీల్లో బాగంగా నెల్లూరు జిల్లా ఎఎస్ పేట నుంచి కర్లపాలెం వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేసిన రేచల్ దివ్య వెదుళ్లపల్లి పశువైద్యశాలకు బదిలీపై వెళ్లారని అన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఎపి ముఠా కార్మికుల ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు సాధన కోసం జులై 9న నిర్వహిస్తున్న దేశ సమ్మెను జయప్రదం చేయాలని ఎపి ముఠా కార్మికుల ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు కోరారు. స్థానిక కొత్త కూరగాయలు మార్కెట్ వద్ద ముఠా కార్మికులతో మంగళవారం మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు అయితే యూనియన్ ఏర్పాటు కఠినతరం అవుతుందన్నారు. కార్మికులకు యూనియన్ లేకుండా చూడాలని ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు భావిస్తున్నాయన్నారు. ఐఎల్ఓ ప్రకారం 45 రోజుల్లో యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. యూనియన్లు రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రభుత్వ యంత్రాంగంపై కార్పొరేట్ కంపెనీలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. బ్రిటిష్ కాలంలో పోరాట సాధించుకున్న కార్మిక చట్టాలను మతాన్ని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చిన బిజెపి

మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

కార్పొరేట్ యాజమాన్య దోపిడీకి మరింత స్వేచ్ఛ ఇచ్చేందుకు కార్మిక చట్టాలను రద్దు చేస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని ఆరోపించారు. ప్రజలపై భారాలను మోపుతూ ప్రజలను సమస్యల నుంచి పక్కకు మళ్లించడానికి మతాన్ని, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని దుయ్యబట్టారు. బిజెపి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై జులై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం మరియు ముఠా వర్కర్స్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ,పాత చట్టాలను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించరాదని కోరారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. ముఠా కార్మికుల రక్షణకు వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన ముఠా కార్మికులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర ఉపాధ్యక్షుడు తంబి శ్రీనివాసులు, ముఠా కార్మికులు శ్రీనివాసరావు, అంజయ్య ,వెంకట్రావు ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-సింగరాయకొండ

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సోమరాజుపల్లి, శింగరాయకొండలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.నిర్మల కుమారి మాట్లాడుతూ పచ్చి రొట్టె ఎరువులు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ టి.పూర్ణచంద్రరావుఎఇఒ షేక్ జహీర్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కొండపి : మండల పరిధిలోని పెద్దకండ్లగుంట, జాల్లపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాల్యాద్రి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్-2025 క్రాఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి ప్రభుత్వం విధి విధానాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం : మండల పరిధిలోని ఆలూరు, గాదెపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదె పాలెంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గుత్తి కొండ ఝాన్సీ లక్ష్మీ, చేజర్ల సుజాత పొలాలను పరిశీలించారు. ఎటిఎం విధానం యొక్క లాభాలను , అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ నరసింహులు, ఎఇఒ అజయ్ కుమార్, వివిఎ చరిత, విఎఫ్ఎ మధులత ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : . మండల పరిధిలోని జయవరం, టి.నాయుడుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవపథకానికి సంబంధించి లబ్ధిదారుల జాబితా గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ధనలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం టి.నాయుడుపాలెం గ్రామము నందు పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి టి.రవికుమార్, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సోమశేఖర్, వ్యవసాయ విస్తరణాధికారులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామ సహాయకులు ప్రావీణ్య, ఫైసీ, సాయి, రైతులు పాల్గొన్నారు.

మద్దిపాడు : మండల పరిధిలోని దొడ్డవరం, గార్లపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ స్వర్ణలత మాట్లాడుతూ కౌలు రైతు కార్డులు తీసుకోవాలన్నారు. కార్డు ఉంటే పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు కౌలు కార్డులు అందజేశారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ పశువుల దాణా, నట్టల నివారణ మందు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిఎలు స్పందన, శిరీష, రైతులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులు ఇప్పించండి

కమిషనర్ ను కలిసి విజ్ఞప్తి చేసిన కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

గత ఏడాదిన్నర కాలంగా తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు కమిషనర్ కె.వెంకటేశ్వర్‌రావును మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు, కార్పొరేషన్ కార్యాలయంలో పలువురు కాంట్రాక్టర్లు కమిషనర్‌ను కలిసి పెండింగ్ బిల్లులపై చర్చించారు. దాదాపు రూ. 40 కోట్లు బిల్లులు సిఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సుమారు మరో రూ. 30 కోట్లు బిల్లులు సిఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేయాల్సి ఉందని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. బిల్లులు రాని కారణంగా తాము కొత్త పనులు ఏమీ చేయలేకపోతున్నామని వాపోయారు. తాము అప్పులు తెచ్చి పనులు చేశామని, వడ్డీలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నామని పలువురు కాంట్రాక్టర్లు కమిషనర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎఫ్ఎంఎస్ విధానాన్ని పక్కనపెట్టి నిధి పోర్టల్‌ను ప్రవేశపెట్టిందని వివరించారు. దీంతో ఈ ఏడాది మార్చి వరకూ సిఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెనక్కి పంపిందని వివరించారు. వెనక్కి పంపిన బిల్లులను నిధి పోర్టల్ లో కొత్తగా అప్లోడ్ చేయమంటున్నారని, అలా చేస్తే ఆ బిల్లులు పేఅండ్ అకౌంట్స్‌కు వెలుతున్నాయని వివరించారు. నిధి పోర్టల్లో తమకు కొత్త రకం చిక్కులు వచ్చి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ

కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్

సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిధి పోర్టల్‌లో సాంకేతికంగా కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉందని వివరించారు . నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోవడానికి వీలులేదని, కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి వారు అగ్రిమెంట్ చేసుకున్న పనులను మొదలుపెట్టాలని కోరారు. కొన్ని రోజుల్లో సమస్య పరిష్కారం కాని పక్షంలో మున్సిపల్ మంత్రిని కలిసి తమ సమస్యలను తెలియజేస్తామని కాంట్రాక్టర్లు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కాంట్రాక్టర్లు పోతంశెట్టి పవన్‌కుమార్, వెంకటరామిరెడ్డి, దండూరి కోటేశ్వరరావు, వేణు, రాము, వెంకటేశ్వర రెడ్డి, అకౌంటెంట్ శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డిఆర్‌డిఎ పీడీ నారాయణ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ తెలిపారు. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామంలో (పిఎంఇజిపి) ద్వారా ఏర్పాటు చేసిన షేడ్‌నెట్స్, దాల్ మిల్లును పీడీ మంగళవారం తనిఖీ చేశారు. వావిలేటిపాడులో రైతు ఉత్పత్తిదారుల సంఘం తరపున గాలి కృష్ణకు షేడ్ నెట్‌ను మంజూరు చేశారు. ఈ యూనిట్ ధర రూ.3,21,000. అందులో 50 శాతం సబ్సిడీ పోను రూ.1,62,000 ఎపిజిబి టంగుటూరు బ్రాంచి నుంచి రుణం తీసుకున్నాడు. అనంతరం పచ్చవ గ్రామంలో పిఎంఇజిపి క్రింద గొర్రెపాటి పుష్పావతికి మంజూరైన మంజూరైన దాల్ మిల్లును

దాల్‌మిల్లును పరిశీలిస్తున్న పీడీ నారాయణ

పరిశీలించారు.ఈ యూనిట్‌ను కామేపల్లి యుబిఐ మంజూరు చేసింది.ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్‌హెచ్ డి.దానం , ఎపిఎం ఎల్‌హెచ్‌ఫారం జె.నారాయణ, ఎపిఎం జి.ఏసురత్నం, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

26న రామకృష్ణ సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మంగి గేయకావ్య సష్టికర్త, సత్తెనపల్లి మండలం సమగ్ర చరిత్ర రచయిత,గొప్ప వ్యాఖ్యాత, సాహితీవేత్త ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ వంకాయలపాటి రామకష్ణ సంస్మరణ సభ 26న నిర్వహిస్తున్నట్లు కళామిత్ర మండలి (తెలుగులోగిలి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం(నరసం) గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలోఉన్న మహిళాభ్యు దయ సమితి కార్యాలయంలో గురువారం సాయంత్రం ఐదు గంటల కళామిత్ర మండలి నరసం సంస్థల సంయుక్త నిర్వహణలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, ప్రరస గౌరవాధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, ప్రముఖ కవి యువి, రత్నం,కె.బాల కోటయ్య, యువ కవయిత్రి బీరం అరుణ, గుంటూరు సత్యనారాయణ, ఎం.సూర్య కుమారి, రామకష్ణ కుటుంబ సభ్యులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సభలో కవులు, రచయితలు ,కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థి పాఠశాల సిబ్బంది మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 582 మార్కులు సాధించిన తన్నీరు శశి నూజివీడులోనిరాజీవ్ గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటి సీటు వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి తన్నీరు శశిని అభినందించారు. ఆరు సంవత్సరాల పాటు బీటెక్ పూర్తయ్యేంతవరకు అత్యున్నతమైన సాంకేతిక విద్య పూర్తి ఉచితంగా అందుతుందని. శశి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

హైవేపై డిఎస్‌పి పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రమాదాల నివారణలో భాగంగా నేషనల్ హైవేపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలను డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. సీతారాంపురం కొష్టాలు సెంటర్ , వెల్లంపల్లి, గ్రోత్ సెంటర్ ప్రాంతాలను పరిశీలించి ప్రమాదాలకు గల కారణాలను స్థానిక ఎస్ఐను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం గ్రోత్ సెంటర్ లోని ఎపిఐఐసి కార్యాలయాన్ని సందర్శించారు. డిఎస్‌పి వెంట ఎస్ఐ శివరామయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ట్రాలీలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక రామతీర్థం సెంటర్ నుంచి అధిక లోడుతో వెళుతున్న ట్రాలీలపై చర్యలు తీసుకోవాలని గుండా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శివరాం ప్రసాద్‌ను మంగళవారంకలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమకుర్తి నుంచి పరిమితికి మించిన రాళ్లను రామాయపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ట్రాలీకి మించి బాడీ ఏర్పాటు చేసుకొని వాహనదారులు అధికలోడును తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగా నిత్యం రోడ్డు ప్రమాద సంభవిస్తున్నట్లు తెలిపారు. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి అధిక లోడ్‌తో వెళ్తున్న ట్రాలీలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బస్టాండ్ ప్రాంతాలు పరిశీలిస్తున్న ఇన్చార్జ్ ఆర్ఎం విమల

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రయాణికులకు మంచి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్టీసీ ఇంచార్జ్ రీజనల్ మేనేజర్ విమల అన్నారు. స్థానిక ఆర్టిసి బస్ స్టాండును ఆమె డిపో మేనేజర్ రామ్మోహనరావు, సిఐ మహబూబ్‌తో కలసి గ్యారేజ్, పరిసర ప్రాంతాల్లోని వివిధ రకాల దుకాణాలను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. ఆర్టీసీ ఇచ్చే సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో చర్చించారు. డిపోకు 5 కొత్త బస్సులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అవి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు.

అద్దంకిలో ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - అద్దంకి

సచివాలయ ఉద్యోగులను ఆ మండల పరిధిలోని కొనసాగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఆనంద్, శ్రీనివాసరావు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ మండల సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో కొనసాగే విధంగా జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేస్తున్న వారు ఆయా సచివాలయాల్లో బదిలీలు కొనసాగే విధంగా ప్రభుత్వం జిఒ ఇచ్చిందని, అదేవిధంగా మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే సచివాలయ ఉద్యోగులకు కూడా అదేవిధంగా కొనసాగేందుకు జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒకు వినత పత్రం అందించడానికి వెళ్లిన సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో తహశీల్దారుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ ఉద్యోగులు అందజేశారు.

ఖాళీపోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఇంకొల్లు సెక్టారులో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు ఆయా పోస్టుల ఖాళీలు ఉన్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ సులోచన రాణి తెలిపారు. కేశవరపాడులో జనరల్ కేటగిరీ కింద ఒక అంగన్వాడీ కార్యకర్త పోస్టు, నక్కలపాలెం వన్‌లో జనరల్ కేటగిరీ కింద ఒక ఆయా పోస్టు, నలతోటివారిపాలెం ఎస్సీ రిజర్వుడ్ అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడి ఆయా పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25 నుంచి జులై 5లోపు దరఖాస్తు చేసుకొని తెలిపారు. సెలవు రోజుల్లో తప్ప అన్ని రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల్లోపు ఇవ్వవచ్చని అన్నారు.

పర్చూరు : పర్చూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడి కార్యకర్త, ఆయా పోస్టులకు ఈనెల 25నుండి జులై 5లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ జి సుభద్ర మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు స్థానికులై ఉండాలని, 21 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని చెప్పారు. ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు ఆయా పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

అయోమయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్

ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ అయోమయ స్థితిలో ఉన్నట్లు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ శ్రీనివాసరావుకు వినతి పత్రం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ గ్రామ స్థాయిలో అయోమయ స్థితిలో ఉండుటంతో ప్రభుత్వం తరుపున స్పష్టత రానియెడల బదలీలను స్వచ్ఛందంగా బహిష్కరించనున్నట్లు తెలిపారు. 2019 నుండి మండలంలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలో పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, సర్వ శిక్ష అభయాన్, గృహ నిర్మాణ సంస్థ వంటి ఇంజనీరింగ్ పనులు క్షేత్ర స్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు. గత ఆరేళ్ల సర్వీసు కాలం ముగిసిన నేటికి ప్రభుత్వం తమకు పదోన్నతులు కల్పించలేదని అన్నారు. తమ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపిడిఒ అద్దూరి శ్రీనివాసరావును కోరారు.

పర్చూరు : మండలంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన అనంతరం ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. మండలంలో 2019 నుండి విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో పిఆర్, గ్రామీణ నీటి సరఫరా, సర్వ శిక్ష అభియాన్, గృహ నిర్మాణ ఇంజనీరింగ్ పనులు క్షేత్రస్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు ప్రభుత్వం ఇస్తున్న సర్వేలు, బిఎల్ఓ డ్యూటీలు ఏకకాలంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జూన్ 12న బదిలీలకు సంబంధించిన జిఒ 05 ప్రభుత్వం విడుదల చేస్తున్నారని చెప్పారు.

ఎంపిడిఒకు అర్జీ సమర్పిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

పొగాకు సాగు చేస్తున్న రైతులు అందుకు ప్రత్యామ్నాయంగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి షేక్ సైదా సూచించారు. మండలంలోని సజ్జాపురం, కొప్పరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులందరూ కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలు అందజేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఈఓ ఎం మాధురి, పిఎస్‌కె సిబ్బంది ఎస్ నాగయ్య, ఎల్ నాగవర్ధన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అద్దంకి : ఈ సంవత్సరం పొగాకు సాగు చేయవద్దని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని గోవాడ, చిన కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పొగాకు సాగు ఎక్కువగా చేసినందు వలన పంట దిగుబడి కూడా ఎక్కువై ధరలు తగ్గి రైతులు ఇబ్బంది పడుచున్నారని అన్నారు. ఉద్యాన శాఖ అధికారిణి దీప్తి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, ధూళిపాళ్ల రామచంద్రరావు, నరిశెట్టి రమేష్ బాబు, విఎఎ సాయిబాబు, ఎఇఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జెఎల్‌జి కౌలురైతు గ్రూపులకు రుణాలు

ప్రజాశక్తి - కొల్లూరు

పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారి వి నరేంద్రబాబు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వరిలోని రకాలు, విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. ఐదుగురు కౌలు రైతులను జెఎల్‌జి గ్రూపు కోసం ఫార్మ్ చేసి బ్యాంకు నందు రుణం ఇప్పించనున్నట్లు తెలిపారు. యూనియన్ బ్యాంకు నుండి రూ.4 లక్షలు, చైతన్య గోదావరి బ్యాంక్ నుండి రూ.2.50 లక్షలు రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. ఎఇఒ ఎం ప్రభాకరరావు, బిఎన్ వంశీ, జి అరుణ, ఎంపిఈఓ పాల్గొన్నారు.

వేమూరు : మండలంలోని కుచ్చేళ్ళపాడు, వెళ్ళబాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది సందర్భంగా ఎఒ జి ప్రేమ సాగర్ మాట్లాడుతూ వరి విత్తనాలు వెద పద్ధతిన వితు కోవాలని తెలిపారు. రాయితీపై వరి విత్తనాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. కేజీకి రూ.5 రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విఎఎ జీవమని పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని తనొబొద్ధివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కుమారి మాట్లాడుతూ పొగాకు పండించిన రైతులు ఆందోళన చందవలసిన అవసరం లేదని అన్నారు. కార్యక్రమంలో విఎఎ సుదర్శన్, శేసిరెడ్డి, నాగబాబు, హరిబాబు పాల్గొన్నారు

రేపల్లె : మండలంలోని పేటేరు రైతు సేవ కేంద్రం పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ ఎ మహేష్ బాబు నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - చీరాల

యోగా డేలు కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ దినోత్సవాలు జరపాలని, కుటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పాలన ముగించుకున్న ఎస్‌సి, ఎస్‌టి, బిసిల సంక్షేమం పక్కన బెట్టిందని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వందల కోట్ల ప్రజాధనం యోగాంధ్ర పేరుతో ఖర్చు చేయటం కూటమి ప్రభుత్వ సనాతన ధర్మ పరిరక్షణ ప్రమోషన్‌లో భాగమేనని అన్నారు. నక్సలైట్లతో ప్రభుత్వ చర్చల సందర్భంగా అప్పటి ప్రభుత్వం దళితుల భూ సమస్యలపై అంగీకరించిన కోనేరు రంగారావు కమిటీ జీఒలు అమలుకు జిల్లా స్థాయిలో డిప్యూటీ కలెక్టర్ ఉన్న ఒక్క దళితుని భూమి ఫిర్యాదు కూడా పరిష్కరించలేదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేయని కార్పొరేషన్లను పునరుద్ధరిస్తామని చెప్పి ఎస్సీ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.431 కోట్లలో ఒక్క రూపాయి కూడా ఎస్సీలకు ఇవ్వలేదని అన్నారు. రుణాలు ఇచ్చేందుకు ప్రైవేట్ ఫైనాన్సుల కంటే ఘోరంగా నిబంధనలు పెట్టిందని అన్నారు. ప్రతినెల 1న భూస్వాములు, వ్యాపారవేత్తలైన కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు జీతాలు, ఇతర అలవెన్సులు తీసుకుంటూ ఎస్సీ, ఎస్టీలకు వచ్చిన అట్రాసిటీ ఉపశమన, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల నిధులు తల్లికి వందనం వంటి పథకాలకు మళ్లించడం సనాతన, యోగాంధ్రాకు దర్పణమని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, కాకుమాను రవి, రాజు పాల్గొన్నారు.

పత్తికి పంట బీమా వర్తింపు

ప్రజాశక్తి - ఇంకొల్లు

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద పత్తి పంటగా ఎంపికైనట్లు వ్యవసాయ అధికారి ఎన్ మేరమ్మ తెలిపారు. మండలంలోని నాగండ్ల, సుదివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంట వేసే రైతులు పంటల బీమా పథకం కింద పత్తి పంటకు ఎకరాకు రూ.1900 ప్రీమియం రైతులు చెల్లించాలని అన్నారు. పంట నష్టం సంభవించినప్పుడు నిబంధనల ప్రకారం ఎకరానికి బీమా పథకం కింద నష్టం పరిహారం రూ.39 వేలు చెల్లిస్తారని తెలిపారు. రైతులకు వివిధ వ్యవసాయ పథకాల గురించి తెలిపారు. కౌలు రైతులు తప్పనిసరిగా సిసిఆర్‌సి కార్డులు పొందాలని అన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు ఉంటేనే కౌలు రైతులకు పంట నష్టం తోపాటు పలు పథకాలు, రాయతీలు, మార్కెట్ సమయంలో సరుకు కొనుగోలు నిర్వహిస్తారని అన్నారు. కార్డు పొందిన కౌలు రైతులు యజమానితో సంబంధం లేకుండా ఈ పథకాలు నేరుగా పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో నాగండ్ల, సుదివారిపాలెం గ్రామాలకు చెందిన విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిళ్ల కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి- చీరాల

నెల్లూరు అలింకో సంస్థ సహకారంతో 80 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు అందజేస్తున్న త్రీవీలర్ విద్యుత్ మోటారు సైకిళ్ల కోసం అర్హత కలిగిన దివ్యంగులు దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ దివ్యాంగుల విభాగం ప్రతినిధి బొందు గుర్రన్న మంగళవారం తెలిపారు. రెండు చేతులు పని చేస్తూ నడుము క్రింది భాగం పనిచేయని దివ్యాంగులు, సదరం సర్టిఫికెట్ తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. వినికిడి లోపంతో బాధపడే 60ఏళ్లు దాటిన వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వీరిలో అర్హులైనవారికి శాసన సభ్యులు మాలకొండయ్య చేతుల మీదగా బ్యాటరీ చార్జింగ్ ట్రై సైకిళ్లు అందజేస్తారని తెలిపారు. వివరాలకు 98853 37078 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

రోటరీ సహాయ గవర్నర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ సహాయ గవర్నర్‌గా నాగభైర శ్రీనివాసరావు ఎన్నికైనట్లు రోటరీ క్లబ్ సభ్యులు మంగళవారం తెలిపారు. కేరళలోని మున్నార్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో సహాయ గవర్నర్‌గా ఆయనను ఏకగ్రీవంగా కాబోయే గవర్నర్ ఎస్‌వి రామ్ ప్రసాద్ ఎంపిక చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఈ పదవి వరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ కార్యవర్గం, సభ్యులు అభినందనలు తెలిపారు. జూలై 1 నుండి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆరోగ్య కేంద్రం

ప్రారంభానికి సిద్ధమైన పిహెచ్‌సి భవనం

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. తుది మెరుగులు దిద్దుకుంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిర్మల్ కుమార్ తెలిపారు. జులై మొదటి వారంలో ప్రారంభం కానున్నదని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో నిధులు సమకూర్చారు. పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో రోజుకి సగటున 90 మంది పేషెంట్లకు వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. నూతన భవనం ప్రారంభించిన వెంటనే అన్ని రకాల రక్త పరీక్షలు, ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం నలుగురు డాక్టర్లు, సిబ్బంది ఉదయం 9 నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025

శక్తి యాప్‌పై అవగాహన ఫ్లకార్డులతో విద్యార్థులు

ఆపద ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - చీరాల

అత్యవసర పరిస్థితుల్లో ఆపద ఎదురైతే విద్యార్థులు, మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని సిఐ సుబ్బారావు అన్నారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు విద్యార్థినీ, విద్యార్థులకు శక్తి మొబైల్ యాప్ ఆవశ్యకత, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, ఇతర మహిళా సంబంధిత నేరాలపై స్థానిక మహిళా డిగ్రీ కళాశాల్లోని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అనుకోని ఆపద ఎదురైతే ఏ విధంగా ఎదుర్కోవాలి, ఏ విషయాన్ని ఎవరితో పంచుకోవాలి, మొదట ఎవరికీ చెప్పాలి, పోలీసుల సహాయం ఎలా తీసుకోవాలనే విషయాలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ వినియోగించుకొని పోలీసు తక్షణ సహాయం పొందవచ్చని అన్నారు. యాప్‌ను ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజ్యలక్ష్మి, శక్తి బృందం పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతో యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు

జంపని సురేష్ (ఫైల్)

భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని కత్తి తో దాడి చేసి దారుణ హత్యకు పాల్పడిన ఘటన భట్టిప్రోలులో చేసుకుంది. ఎస్ఐ ఎం శివయ్య తెలిపిన వివరాల ప్రకారం వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన చాగలమర్రి రత్నబాబుకు భట్టిప్రోలు గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా భార్యా, భర్తల మధ్య వివాదం నెలకొనడంతో భార్యా భట్టిప్రోలులో పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఇదిలా ఉండగా రత్నబాబు భార్యతో అదే గ్రామానికి చెందిన జంపని సురేష్‌కు వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపారు. భట్టిప్రోలులో పుట్టింటి వద్ద ఉంటున్న ఆమె వద్దకు సురేష్ వచ్చి వెళుతూ ఉంటాడు. ఈ సమాచారం తెలుసుకున్న రత్నబాబు భట్టిప్రోలుకు వచ్చి సురేష్ భట్టిప్రోలులో ఉండటాన్ని నిర్ధారించుకొని అతనిని హత్య చేయాలని పథకం పన్నాడని తెలిపారు. దీంతో భట్టిప్రోలు బస్టాండ్ సమీపంలో మద్యం షాపు వద్దకు వచ్చి వెళుతున్న సురేష్‌ను పాత వ్యవసాయ కార్యాలయం దాటగానే వెనుక నుండి మెడపై కత్తితో దాడి చేశాడు. మెడకు బలమైన గాయం కావడంతో అక్కడి అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో చుట్టుపక్కల వారు గమనించి దాడి చేసి పారిపోతున్న రత్నబాబును గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపింది. అపస్మారక స్థితిలో కొట్టుమిట్టాడుతున్న సురేష్‌ను 108 వాహనం ద్వారా వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు ఘటన స్థలాన్ని పరిశీలించి భార్య పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

ప్రజాశక్తి - బాపట్ల

శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఓ తెలుగు న్యూస్ ఛానల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. బాపట్ల రూరల్, పట్టణం, వెదుళ్ళపల్లి, కర్లపాలెం, చందోలు పోలీసు స్టేషన్లలో ఎస్ఐలకు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏపూరి భూపతిరావు, పల్లం సరోజినీ, షేక్ బాజీ, అఫ్జల్, వెంకటపతి రాజు, గొలపల శ్రీనివాసరావు, ఆంథ్రేయ పాల్గొన్నారు.

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్ జె వెంకట మురళి

ఆక్రమణకు గురైన దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. రాష్ట్రంలో దేవాదాయ, మైనారిటీ సంక్షేమ భూముల పరిరక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను నిర్ణయించిందని, జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లాలో ఆక్రమణకు గురైన దేవాదాయ శాఖకు సంబంధించిన భూముల సర్వే చేపట్టవలసిన తెలిపారు. బాపట్ల పట్టణంలోని భావన్నారాయణ స్వామికి సంబంధించి 6.62ఎకరాలు, శ్రీ ఈశ్వరన్ చౌల్ట్రీకి సంబంధించి 28 సెంట్లు స్థలం ఆక్రమణకు గురైందని తెలిపారు. పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ ఆలయానికి చెందిన 4.71ఎకరాలు, చీరాల శ్రీ మదన గోపాల స్వామి ఆలయానికి చెందిన 5.36ఎకరాలు, భట్టిప్రోలులో శ్రీ విరలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన 97 సెంట్లు భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. ఈ ఆక్రమించిన స్థలంలో పక్కా గృహల నిర్మాణం జరిగిందని వివరించారు. స్థలాలు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్న వారిని పిలిపించి ధర చెల్లించడం లేక లీజుకు తీసుకొని ప్రభుత్వానికి డబ్బు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ ఎడి, బాపట్ల ఆర్‌డిఓ, బాపట్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కొల్లూరులో శ్రీ సోమశేఖర్ స్వామి దేవస్థానంకు సంబంధించిన 222.89 ఎకరాలు, భట్టిప్రోలులో శ్రీ నరేంద్ర స్వామి దేవస్థానానికి సంబంధించిన 62.31ఎకరాలు, శ్రీ వరదరాజు స్వామి దేవస్థానంకు చెందిన 81.42ఎకరాలు ఆక్రమణకు గురైనాయని, స్థలంలో రైతులు సాగు చేసుకుంటున్నారని వివరించారు. ఆర్‌ఓఆర్ కింద కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, దేవాదాయ అధికారి సూర్య ప్రకాశరావు, డిపిఒ ప్రభాకర్, ఆర్‌డిఒ పి గ్లోరియా, పురపాలక కమిషనర్లు పాల్గొన్నారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న డిపిఒ ప్రభాకరరావు

పల్లె నుండి నగరాల వరకు స్వచ్ఛమైన, సుందర నందనంగా తీర్చిదిద్దడమే లక్ష్యం గా పంచాయతీరాజ్ అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి కెవిఎల్ ప్రభాకరరావు చెప్పారు. స్థానిక ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2025పై జరిగిన జిల్లా స్థాయి శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్త వ్యర్థాల నిర్వహణ కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలు తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం రాబోతుందని తెలిపారు. స్వచ్ఛతపై వివిధ అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి మార్కులు కూడా కేటాయిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసి మన గ్రామాలకు మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. గ్రామీణ మంచినీటి సరఫరా ఎస్ఇ అనంతరాజు మాట్లాడుతూ వ్యక్తి గత మరుగు దొడ్ల నిర్మాణం తోపాటు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇంకుడు గుంతలు నిర్మాణం, ప్లాస్టిక్ నియంత్రణ, బహిరంగ మల విసర్జన లేని గ్రామాలను రూపొందించడంలో ఉద్యోగులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిడిఓలు, డిఎల్పిఓలు, ఎంపిడిఓలు, డిప్యూటీ ఎంపిడిఓలు, ఎంఆర్‌సిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, అప్పుడే యువత బంగారు భవిష్యత్తును నిర్మించుకోగలుగుతారని ప్రముఖ సైకాలజిస్ట్ (కెవిఎయు) డాక్టర్ ఎ విజయ రత్నం పేర్కొన్నారు. స్థానిక ఎబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన, మత్తు రహిత సమాజం మన లక్ష్యం అనే అంశంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవి చంద్ర కుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో డాక్టర్ ఎ విజయ రత్నం మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత క్రమశిక్షణ అలవర్చుకోవాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని, తద్వారా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని సూచించారు. విద్యార్థి దశలో మంచి లక్ష్యాలు కలిగి ఉండాలని అన్నారు. వాటి సాధన కోసం అకుంఠిత దీక్షతో కష్టించి సాధించాలని పేర్కొన్నారు. నేటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైందని అన్నారు. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నల్లమందు, మార్ఫిన్‌కు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువు వదిలి సర్వస్వం కోల్పోయి నిర్వాగ్యులౌతున్నారని పేర్కొన్నారు. ఒకసారి దీనికి బానిసలైతే తమ బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచేసుకున్నట్లు అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం హెల్త్ కేర్ కౌన్సిలర్ పి విజయకుమార్ విద్యార్థుల చేత మత్తు రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎం దాసు, ఎం బుజ్జిబాబు, కె బాలాగురవయ్య, బి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - పంగులూరు

సాధారణ తనిఖీల్లో భాగంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సిహెచ్ విజయ జ్యోతి కుమారి మంగళవారం పరిశీలించారు. తహశీల్దారు పి సింగారావుతో కలిసి ముప్పవరంలోని 235, 236, 237, కళ్ళంవారిపాలెంలోని 216, బూదవాడలోని 217, 218, 219, చందలూరులోని 250, 251, 252 నంబర్లు గల పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాల వద్ద కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారు. చందలూరు పోలింగ్ కేంద్రం 251లో స్లాబు పెచ్చులు ఊడుతున్నందున ప్రత్యామ్నాయంగా ప్రక్కనున్న బిల్డింగును పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

గాయకుడు కొండలుకు సత్కారం

ప్రజాశక్తి - బాపట్ల

'రఘుకుల తిలక రారా' అనే పాటకు సొంత బాణీని చేకూర్చి పాడిన పాట బహుళ ప్రచుర్యం పొంద డంతో గాయకుడు పసుపులేటి కొండలు స్వామిని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి మంగళవారం సన్మానించారు. కర్లపాలెం మండలానికి చెందిన గాయకుడు పసుపులేటి కొండల స్వామి అభినందనీ యుడని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి దివ్యాంగుల భాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, కోకి రాఘవరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, వైసిపి మండల అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, జోగి రాజా, పసుపులేటి సాంబయ్య, చల్లా కొండలు, కత్తుల జార్జి, పసుపులేటి ఏడుకొండలు, కత్తుల గోపి పాల్గొన్నారు.

సుధీర్‌బాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న అశోక్ బాబు

సుధీర్‌బాబు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వేమూరు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జలాది సుధీర్ బాబు ఇటీవల అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు వైసిపి నాయకులతో కలిసి సుధీర్ బాబు కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన గాడల్లి దేవదాసు సతీమణి కుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రొఫెసర్ శశిధర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - కొల్లూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతపురం జెఎన్టియు సీనియర్ ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి శశిధర్‌కు అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ళమూడి ప్రభాకరరావు అభినందనలు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు ఎపిపిఎస్సీ సభ్యునిగా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, అయితే విద్యారంగంలో చేసిన కృషి ఎల్లప్పుడూ మిగిలి ఉంటుందని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత అన్నారు. తమ పాఠశాల నుండి బదిలీపై వెళుతున్న బత్తుల రామకోటిరెడ్డి, బివిఆర్ ప్రసాద్, గోరంట్ల స్వాతి, వి శ్రీనివాస్, వై శ్రీనివాస్, కె గఫూర్, కె నాగరాజును మంగళవారం సన్మానించారు. వీరితోపాటు ట్రిపుల్ ఐటీలో సీట్ల సాధించిన బత్తుల వేదశ్రీ, ఎండ్లూరి సుమనశ్రీ, పంచుమర్తి భవ్యశ్రీకి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో, ఉత్తమమైన విద్య అందించి భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు పాఠశాల నుండి బదిలీపై వెళ్లడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయినప్పటికీ ఆ లోటు భర్తీ చేసుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద చింతల సహదేవుడు, ఎస్ఎంసి చైర్మన్ గోలి సంధ్యారాణి పాల్గొన్నారు.

నోట్ బుక్స్ అందజేస్తున్న ఎంఇఓ వీరాంజనేయులు

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లోని 61 మంది విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ ఎంఇఓ మంగళవారం పంపిణీ చేశారు. ఈ నోట్ బుక్స్‌ను పాఠశాల ఉపాధ్యాయులు నూకతోటి జ్యోతిర్మయి బాబు బహుకరించారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలోకి వెళ్లాలని కోరారు. నోట్ బుక్స్ బహుకరించిన జ్యోతిర్మయిని అభినందించారు.

సిఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే దామచర్ల

సిఎంను కలిసిన దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మంగళవారం నాడు అమరావతిలో సిఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి సిఎంకు వివరించారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

జిల్లా ప్రణాళిక అధికారిగా షాలెమ్ రాజు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా ప్రణాళిక అధికారిగా ఏ. షాలెమ్ రాజు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇప్పటివరకు ఇక్కడ సిపిఒగా పనిచేసిన కె. శ్రీనివాసరావు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న షాలెమ్ రాజు నియమి తులయ్యారు. ఈ సందర్భంగా ప్రణాళికశాఖలోని అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

జిల్లా ఆడిట్ అధికారిగా భారతి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఆడిట్ అధికారిగా సిహెచ్. భారతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పల్నాడు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకట మురళిని మర్యాదపూర్వకంగా మొక్కను అందజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని ఎఆర్సి అండ్ జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ శంకరరావు తెలిపారు. కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపిసి చదువుతున్న కుర్రు త్రిగుణ అనే విద్యార్థిని ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అండర్ -18 బాల బాలికల విభాగంలో జాతీస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 1 వరకూ ఉత్తరాఖండలోని హరిద్వార్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో త్రిగుణ పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎపికైన త్రిగుణను కళాశాల ప్రిన్సిపల్ ఎం. సౌజన్య ప్రత్యేకంగా అభినందించారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు

వెంకటసాయి చరణ్‌తేజ

టంగుటూరు మండలంలో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి విద్యార్థులకు ఎంపికైనట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి డేగ వెంకటసాయి చరణ్‌తేజ ఒంగోలు క్యాంపస్ ,ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పుట్టా వెంకటబార్గవి నూజివీడు క్యాంపస్, ఉప్పితెర్ల దివ్యశ్రీ ఆర్‌కెవల్లి క్యాంపస్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు తెలియచేశారు. ట్రిపుల్ ఐటి సీటుకు ఎంపికైన విద్యార్థులను ఆయా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు, గ్రామస్తులు అభినందించారు.

10 రోజుల్లో బంగారు బాల్యం సర్వే పూర్తి

- పిల్లలు ఆధార్ కార్డులు పొందేలా చర్యలు

- జిల్లా కలెక్టర్ తమీమ్ అనార్సియా

ప్రజాశక్తి- ఒంగోలుకలెక్టరేట్

బంగారు బాల్యం యాప్ ఆధారిత సర్వేను పది రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యల బారిన పడే (వల్నరబుల్) చిన్నారుల గుర్తింపుతో పాటు ఆధార్ కార్డుల రిజిస్ట్రేషన్ , బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలలో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాప్‌లో పొందుపరచిన వివిధ ప్రమాణాల ప్రకారం వల్నరబుల్ చిన్నారుల గుర్తింపు ప్రక్రియను 10 రోజుల్లోగా అన్ని మండలాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్ళలోని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వల్నరబుల్ పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు. ఇతర ఆవాస ప్రాంతాలలోని ఈ విధమైన పిల్లలను మహిళా సంరక్షణ కార్యదర్శులు గుర్తిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ దిశగా తమ పరిధిలో సర్వే పూర్తి అయ్యేలా ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఐసిడిఎస్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

సూపర్‌వైజర్లు సమన్వయంతో పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఈ తరహా పిల్లలను గుర్తించే బాధ్యతను నోడల్ అధికారిగా ఒక టీచర్‌కు అప్పగించాలని ఆమె తెలిపారు. ఈ సర్వే పది రోజుల్లో పూర్తి చేయాలని, తర్వాత పది రోజుల్లోగా విద్యార్థులకు ప్రభుత్వం నుంచి, ఇతర దాతల నుంచి అవసరమైన ప్రయోజనం కల్పించేలా దష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి తన పరిస్థితిని బట్టి అవసరమైన సహాయం అందేలా ప్రత్యేకంగా వ్యక్తిగత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఆధార్ కార్డు లేని ఆరేళ్లలోపు పిల్లలు కూడా కార్డులు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జనన, ధృవీకరణ పత్రాలు లేని కారణంగా ఆధార్ కార్డులు పొందలేకపోతున్న వారిని గుర్తించి, ఈనెల 27న జనన ధృవీకరణ పత్రాలు పొందేందుకు అర్హులతో దరఖాస్తు చేయించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే జనన ధవీకరణ పత్రాలు కలిగి ఉన్నవారికి వెంటనే ఆధార్ కార్డులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

బడి వయసు కలిగిన పిల్లలు సుమారు 13వేల మంది ఇప్పటికీ బడి వెలుపల ఉన్నారని, వీరందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే నెల ఒకటి, రెండు, మూడవ తేదీలలో జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గుడ్ టచ్ - బ్యాడ్ టచ , ఫోక్సో చట్టం, లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. వారికి ఏ విధమైన సహాయం కావాలన్నా 1098 నంబరుకు ఫోన్ చేసే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ విధంగా వారి పుస్తకాలలో ప్రత్యేక స్టాంపు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ఫిర్యాదుల పెట్టెను పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ బి.చిరంజీవి, డిఇఒ ఎ.కిరణ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ సువర్ణ , డిసిపిఒ దినేష్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మనాయక్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధన్ రెడ్డి , ఒంగోలు ఆర్‌డిఒ కె. లక్ష్మి ప్రసన్న , నోడల్ ఆఫీసర్ గిరిధర్ శర్మ, ఎంపిడిఒలు, సిడిపిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఇఒలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తదితరులు హాజరయ్యారు.

పొగాకు ధరలు తగ్గకుండా చూడాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంత్ బాబు

ప్రజాశక్తి - మద్దిపాడు

నల్లబర్లీ పొగాకు ధరలు తగ్గకుండా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంత్ బాబు తెలిపారు. మండల పరిధిలోని గార్లపాడులో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన మేరకు రైతులు వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలన్నారు. చిన్న, చిన్న కారణాలతో పొగాకు బేళ్లను వెనక్కి పంపే చర్యలకు పాల్పడొద్దని కోరారు. అనంతరం పొగాకును పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం

పొగాకును పరిశీలిస్తున్న జయంత్ బాబు

నాయకులు కనపర్తి సుబ్బారావు, శ్రీకాంత్, యజేంద్ర, వెంకటరామిరెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి-మద్దిపాడు : ప్రభుత్వం రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయకుండా చేపట్టిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీ నిలిపివేయాలని ఎంపిడిఒ శ్రీనివాస వరప్రసాద్ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూరేషనలైజేషన్ ప్రక్రియ అసంపూర్తిగా ఉన్నట్టు పేర్కొన్నారు. మిగులు ఉద్యోగులపై స్పష్టత ఇవ్వకుండా బదిలీలను చేపట్టడంపై పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 5 ను ప్రభుత్వం సవరించాలన్నారు. తాము ఉద్యోగాల్లో చేరి ఆరు సంవత్సరాలు దాటినా నేటికీ ప్రమోషన్లు ఇవ్వలేదని తెలిపారు. సొంత మండలంలో కాకుండా పక్క మండలాల్లో బదిలీ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. తాము పేరుకే ఇంజినీరింగ్ అసిస్టెంట్లమని తమ చేత అన్ని శాఖల్లో పనులను కేటా యిస్తున్నారని ఆరోపించారు.అనంతరం పంచాయతీరాజ్ ఎఇ రవి బాబుకు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కార్యదర్శిపై కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : రూరల్ మండల పరిధిలోని వలేటివారిపాలెం పంచాయతీ కార్యదర్శి అధికార దుర్వి నియోగానికి పాల్పడుతున్నట్లు గ్రామ సర్పంచి నల్లమోతు ఉషారాణి మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21న గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం ఉదయం 11:00 గంటలకు నిర్వహించేందుకు అజెండా నోటీస్ తయారు చేసిన కార్యదర్శి నిబంధనలు పాటించలేదని పేర్కొన్నారు. ముందుగా ప్రకటించిన నిర్ణీత సమయం కంటే ముందుగానే సర్పంచి హాజరు కాకుండానే సమావేశం నిర్వహించినట్లు ఆమె ఆరోపించారు. కార్యదర్శి పంచాయతీ రాజ్‌చట్టాన్ని అతిక్రమిస్తున్నారని, బిల్లుల చెల్లింపునకు సహకరించడం లేదని ఆరోపించారు.

నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ : జిల్లాలోని, 28 కస్తూరిబా విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్స్ సిబ్బంది రిక్వెస్ట్ బదిలీలకు సంబంధించి సీనియారిటీ జాబితా ను వెబ్ సైట్ లో ఉంచినట్లు సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్, ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ రీ సోర్స్ పర్సన్స్,పార్ట్ టైమ్ ఇన్స్ట్రక్టర్స్, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్, మండల్ లెవల్ అకౌంటెంట్స్, సైట్ ఇంజనీర్స్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, మెసెంజర్స్, ఆఫీస్ సభఆర్డినేట్స్ బదిలీలకు నిర్దేశించిన జాబితా లో ఏమయినా అభ్యంతరాలు ఉన్నచో 27 లోపుగా తెలపాలని ఆయన సూచించారు.

పొగాకు కొనుగోళ్లు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను పెంచి కొనుగోళ్ళు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై మార్క్ ఫెడ్, వ్యవసాయశాఖ అధికారులు, ఎంపిడిఒలు మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. రైతుల నుంచి ప్రతి ఆకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని రైతులకు తెలియపరచాలన్నారు. సిఎం యాప్ లో రైతుల పేర్ల నమోదు వేగంగా చేపట్టాలన్నారు. జిల్లాలో మూడు కేంద్రాలలో నల్లబర్లీ కొనుగోలు కొన సాగుతుందని, ఎనిమిది కేంద్రాలకు విస్తరించాలన్నారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని మార్క్‌ఫెడ్ ఏడీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుకు 30 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరుగుతుందని, దీన్ని 50 మెట్రిక్ టన్నులకు పెంచేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

అధికారులు సూచించారు. వీక్షణ సమావేశంలోపాల్గొన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు మాట్లాడుతూ దేశంలోని మొట్ట మొదటిసారిగా పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం రూ 273.17 కోట్ల నిధులు మంజూరునకు అంగీకరించినట్లు తెలిపారు. అందులో రూ .100 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పొగాకు కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులు ఖాతాలో నగదు అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, మార్క్‌ఫెడ్ ఏడీ కరుణశ్రీ, ఉప కలెక్టర్ లవన్న, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.